www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 నవంబర్ 2023
5

వైఎస్ఆర్

పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం, మేయర్

అందరికీ ఆదర్శం మహాత్మా జ్యోతిరావు పూలే

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష

6లో

పెద్దలకే 'అసైన్డ్'?

మార్కెట్ రేట్‌కు 2.5 రెట్లు చెల్లింపులతో సరి

తాజాగా కలెక్టర్లకు ఆదేశాలు!

పంపిణీకి 30,059 ఎకరాలు గుర్తింపు

జిల్లాలో అసైన్డ్ భూములను పెద్దల పరం చేయడానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం క్రమబద్ధీకరణ పేరుతో గైడ్‌లైన్స్ రూపకల్పన చేసింది. తాజాగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పేదల ముసుగులో ప్రజాప్రతినిధుల అను యాయులు, బడాబాబులకు కట్టబెట్టనుంది. అసైన్డ్ భూములు సహజంగా పెద్దల ఆక్రమణల్లో ఉండడం కద్దు. ఇటువంటి పరిస్థి తులను ఆసరా చేసుకుని పెద్దల అనుభవంలో ఉన్న భూములను అసైన్డ్‌మెంట్ కమిటీ పేరుతో పేదలకు పంపిణీ చేయాల్సింది పోయి, 2.5 రెట్లు చెల్లింపుల పేరుతో అనుభవజ్ఞులకు ధారాదత్తం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 1,54,314 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. 30,059 ఎకరాల పంపిణీ నిమిత్తం జిల్లా అధికార యంత్రాంగం గుర్తించింది. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 401 లేఅవుట్లు, జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో 250 లేఅవుట్లు అక్రమంగా ఉన్నాయి. వీటిలో నాలుగో వంతు అసైన్డ్ భూములు కావడం వల్లే ల్యాండ్ కన్వర్షన్ కావడం లేదని తెలుస్తోంది. అసైన్డ్ భూముల పంపిణీ చేయడానికి అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఏడు వేల ఎకరాల అసైన్డ్ భూములు నిజమైన అర్హుల చేతిలో ఉన్నట్లు అంచనా. మిగిలిన భూములన్నీ అనర్హులకే పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. మూడు నెలల కిందట పులివెందుల మండల జాబితాలో కొంతమంది అనర్హుల పేర్లు వెల్లడి కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అసైన్డ్ భూముల వివరాలు, జాబితాలు బయటికి పొక్కనీయకుండా సకల జాగ్రత్తలు తీసుకుంది. అనర్హుల పేర్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, చాపాడు తదితర మండలాల జాబితాలో అనర్హుల పేర్లు ఉండడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. అసైన్డ్ పందేరానికి తటపటాయించింది. అసైన్డ్‌మెంట్ భూముల పంపిణీ జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నట్లు వెల్లడైన నేపథ్యంలో ఓ ఐదు మండలాల్లో రీసర్వే పేరుతో గోప్యంగా కథ నడిపిస్తోంది. ప్రభుత్వం 2024 సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో క్రమబద్ధీకరణ పేరుతో ప్రజాప్రతినిధుల అను యాయులు, అనుచరులు, బడా బాబుల అనుభవంలో ఉన్న భూములను కైవసం చేసుకునేందుకు కసరత్తు చేసింది. ఇటువంటి భూములకు మార్కెట్ రేటు కంటే 2.5 రెట్లు చెల్లింపులు చేస్తే యాజమాన్య హక్కులను దఖలు పరుస్తామని, బిపిఎల్ పరిధిలో ఉన్న వ్యక్తుల ఆధీనంలోని అసైన్డ్ భూములకు మార్కెట్ రేటు ప్రకారం చెల్లింపులు చేస్తే సరిపోతుందని జిఒను తెచ్చింది. భూములు లేని పేదలకు మిగులు, అసైన్డ్ భూములు పంపిణీ చేయాలనే ఆశయాన్ని ఉద్దేశ పూరితంగా పక్కదారి పట్టిస్తుండడం పట్ల పేదల్లో తీవ్ర ఆవేదనను మిగుల్చుతోంది. అనుభవం, ఆక్రమణల్లోని అసైన్డ్ భూములను సంబంధిత వ్యక్తులకు అసైన్డ్ భూములను కట్టబెట్టడం భూములు లేని పేదలకు భూముల పంపిణీ చేయడమనే ఆశయం నుంచి పక్కకు తప్పుకోవడమే అవుతుందనడంలో సందేహం లేదు.

పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

అసైన్డ్ భూముల గుర్తింపులో గోప్యత ఎందుకో తెలియడం లేదు. పారదర్శకంగా గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లయితే గోప్యత ఎందుకు. అసైన్డ్ భూముల వివరాలను, జాబితాలను ఎందుకు బయట పెట్టరు. ఇలా చేయడం వల్ల గోప్యత ముసుగులో లొసుగులు ఉన్నట్లు అనుమానించాల్సి వస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం అసైన్డ్ భూముల పంపిణీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలి.

- వి.అన్వేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

ఉద్యమ కార్యాచరణ : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను అప్గ్రేడ్ చేయాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం ఉద్యమ కార్యాచరణకు సంబంధించి సన్నాహక సమావేశం యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు, యాజమాన్యం నుంచి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి యుటిఎఫ్ ఉద్యమం కారణంగా వచ్చాయని చెప్పారు. నిరంతర ప్రాతినిధ్యాలతో మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఒ అధికారాలు, జీతాలు, మ్యాపింగ్ సమస్యలు పరిష్కరించామని తెలిపారు. మౌలికమైన సమస్యలు కొన్ని ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల మాదిరి మున్సిపల్ టీచర్ల పోస్టులను కూడా సబ్జెక్టు టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాల్సి ఉన్నప్పటికీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిటిలుగా కొనసా గుతున్నారని, మున్సిపల్ పాఠశాలల్లో పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగినందున, సబ్జెక్టు టీచర్ల కొరత తగ్గించడానికి వెంటనే అప్గ్రేడ్ చేయాలని డిమాండ్ చేసారు. విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చిన తర్వాత కూడా బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించలేదని, ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యాయులతో సమానంగా బదిలీలు, ప్రమోషన్లు, అప్గ్రేడేషన్ అమలవుతున్నాయని చెప్పారు. విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీ నెరవేరలేదని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్ నిర్వహించాలని కోరారు. వీటితో బాటు మున్సిపల్ టీచర్ల పిఎఫ్ ఖాతాలను వెంటనే ప్రారంభించాలని, గతంలో ఉన్న పిఎఫ్ మొత్తాన్ని డ్రా చేసుకునే అవకాశం ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి యుటియఫ్ చేపట్టే దశలవారీ పోరాటాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 29న డిఇఒ, కలెక్టర్‌కు, డిసెంబర్ 1న విద్యా శాఖ కమిషనర్‌కు నోటీసులు, 5న మున్సిపల్ కేంద్రాల్లో నిరసన, 12, 13, తేదీల్లో అన్ని మున్సిపాల్టీల్లో ప్రచారం, 15న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, 20, 22న జిల్లాల వారి సదస్సులు, 30న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు జి. వెంకటసుబ్బయ్య, సలీం బేగ్, కరిముల్లా, బత్తుల చంద్రశేఖర్, గోపీనాథ్, సుజిత్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్/సెక్రటరీలను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగ ళవారం భోజన విరామ సమయంలో నగరంలోని పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసు కుని వచ్చి అవినీతి రహితంగా, నేరుగా, త్వరితగతిన ప్రజలకు సేవల ందాలనే గొప్ప ఆశయంతో ప్రభుత్వం సచివాలయాలంలో 19 శాఖల ఉద్యో గులను నియమించారని పేర్కొన్నారు. అయితే ఒక్క ఎనర్జీ సెక్రటరీలను విస్మరించి వారి బతుకులను గాలిలో దీపాలుగా మార్చివేస్తున్నారని వాపో యారు. సచివాల వ్యవస్థలో భాగంగా ఎనర్జీ అసిస్టెంట్లను నియమించారని తెలిపారు. సచివాల వ్యవస్థ ఏర్పాటై నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేటికి కూడా మెడికల్ లీవ్, ఇఎల్‌తో పాటు సాధారణ సేవలకు కూడా అమలు కావడం లేదని చెప్పారు. నో వర్క్ నో పే అంటూ జీతాలలో కోత విధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి, పండుగ, ఆదివారం అన్న తేడా లేకుండా వారి సర్వీసు రూల్స్ ప్రకారం 24/7 పనిచేయిస్తూ మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలు సచివాలయ ఉద్యో గుల కన్నా ఏ ఒక్క రూపాయి కూడా అదనంగా ఎనర్జీ సెక్రటరీలకు చెల్లించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థ మమ్మల్ని సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని లేదా విద్యుత్ సంస్థలోని ఉద్యోగులకు అమలు చేస్తున్న పాత సర్వీస్ రూల్స్ నే అమలు చేసి విద్యుత్ ఉద్యోగులుగా నన్న గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కృపాకర్, జిల్లా సమితి సభ్యులు ప్రకాష్ రావు, కులయప్ప, నారాయణరెడ్డి, మల్లికార్జున, నాగేంద్ర, శ్రీకాంత్, సత్తార్, నాగార్జున, ఓంకార్ వెంకటేష్, పాల్గొన్నారు.

నేడు ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్ రాక

ప్రజాశక్తి - కడప

ఎన్నికల రోల్ అబ్జర్వర్ డి. మురళీధర్, ఈనెల 29న సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌లో సమ్మరీ రివిజన్ ఆఫ్ ఫొటో ఎలక్ట్రోల్స్ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ వి.విజయ్ రామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు.

అన్ని మతాల సారం ఒక్కటే

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్ని మతాల సారం ఒకటేనని పెద్ద దర్గా పీఠాధిపతి హజ్రత్ ఆరీపుల్ల హుస్సేన్ సాహెబ్ అన్నారు. మంగళవారం జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా, ప్రముఖ ముస్లిం మైనార్టీ నాయకులు ఆరిఫ్ బాషా పీఠాధిపతికి అన్ని మతాల చిహ్నం గల ఫొటోను బహుకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల, మతాల అతీతంగా జరుపుకునే ఉరుసు మహోత్సవం విజయవంతం చేయాలని కోరారు. పెద్ద దర్గా ఉరుసుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తుంటారని చెప్పారు. ఉరుసు రోజున హిందూ దేవాలయాలను, క్రిస్టియన్ చర్చలను శుభ్రపరిచి లైటింగ్ వేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అలీ ఖాన్, ముజావర్, అమీర్, గౌస్, ఆరిపుల్లా పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన ధ్రువీకరణ పత్రం ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సభ్యత్వం తీసుకునేవారికి గుర్తింపు కార్డుతోపాటు బహుళ ప్రయోజన ధ్రువీకరణ పత్రం ప్రదానం చేయనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు ఈ ధ్రువీకరణ పత్రం ప్రత్యేక గుర్తింపుగా ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న పాఠకులు, సాహిత్య పాఠకులు శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నియోజకవర్గంలో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం 31వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ముక్త కంఠంతో నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రపంచ స్థాయిలో అమరావతి రాజధాని నిలవాలని చంద్రబాబు నాయుడు ఎంత కృషి చేశారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని రావణకాష్ట చేశారని విమర్శించారు. ఎవరు మాట్లాడినా అన్యాయంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, కడప నగర ఉపాధ్యక్షులు శివ శంకర్ రెడ్డి, నాగేంద్ర నాయుడు, మాజీ వార్డు నంబర్ జయరాం రెడ్డి, కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు. **బద్వేలు :** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి బొజ్జ రోషన్న పేర్కొన్నారు. మంగళవారం గోపవరం మండలంలోని అడుసువారిపల్లె, రేకలకుంట, బ్రాహ్మణపల్లి, నిరుద్రపల్లె గ్రామాల్లోని ప్రజలకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టో గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మామిడి సుధాకర్ రెడ్డి, పళ్లెం యల్లారెడ్డి, బుట్టి వెంకటరెడ్డి, ఎం సుబ్బారెడ్డి, ఎరుకల రెడ్డి, లగ్గా రమణయ్య, రత్తయ్య, మల్లెం కొండయ్య, సుధాకర్ యాదవ్, శ్రీనివాసులు, సాంబయ్య , కరుణాకర్ శెట్టి, దళిత నాయకులు పెద్దన్న, సాంబయ్య, నారాయణ, వెంకటయ్య, మల్లికార్జున, సుబ్బరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి, కలెక్టర్

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి కడప అర్బన్

ఈ నెల 30న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నగర పర్యటన నేపథ్యంలో పెద్ద దర్గా, విమా నాశ్రయం వద్ద కలెక్టర్ వి. విజయరామరాజుతో కలిసి చేపట్టాల్సిన ముందస్తు భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పలు సూచనలు చేశారు. భద్రతా చర్యలపై పోలీసు అధికారులు, సిబ్బంది కి దిశానిర్దేశం చేశారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశి ంచారు. వారి వెంట ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యు. వెంకటకుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప

క్రైస్తవ పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్రిస్టియన్ బోర్డు ప్రభుత్వ సలహాదారులు బత్తల బాలస్వామికి ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ఫెడరేషన్ కడప జిల్లా అధ్యక్షులు మల్లం విజయ భాస్కర్, కమిటీ పాస్టర్లు వినతి పత్రం అందజేశారు. మంగళవారం కడప సిఎస్ఐ కమ్యూనిటీ హాల్ లో క్రైస్తవనాయకుల సమావేశం నిర్వహించారు. క్రైస్తవ ఇండిపెండెంట్ పాస్టర్ల తరఫున ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ హాజరై క్రైస్తవ సమస్యలపై క్రిస్టియన్ బోర్డ్ సలహాదారులు బత్తల బాలస్వామికి విన్నవించారు. పాస్టర్ గౌరవేతనం రూ. 5000 నుంచి రూ. 10000 వరకు పెంచాలని పేర్కొన్నారు. క్రిస్టియన్ భవనం ఏర్పాటు చేయాలని, క్రిస్టమస్ ఐటీ పోగ్రామ్ కు లక్ష రూపాయలు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిపిఎఫ్ నగర అధ్యక్షులు పాస్టర్ సుధీర్ కుమార్ జనరల్ సెక్రెటరీ పాస్టర్ డేవిడ్ రాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పాస్టర్ విజయ శేఖర్, పాస్టర్లు సందీప్ రాజ్, వరప్రసాద్, విజయ్ కుమార్, అబ్రహం, జాన్సన్, అమర్‌నాథ్, చార్లెస్ విజయ్‌కుమార్, అలెక్స్ సురేష్, రాజ్, వినోద్ పాల్గొన్నారు.

బత్తల బాలస్వామికి విన్నవిస్తున్న విజయ్‌భాస్కర్

గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.25 లక్షలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

కడప -రాయచోటి రహదారిలో వెలసిన శ్రీ గంగమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఇఒ సురేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. 1,25,266 లక్షలు వచ్చాయని పేర్కొన్నారు. ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బిపి విశ్వనాథరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కలసపాడు

సంక్షేమ పథకాలను పేదలకు అందిం చిన ఘనత ముఖ్య మంత్రిదేనని వైసిపి మండల అధ్యక్షులు సగిలి సుదర్శన్ పేర్కొన్నారు. మం గళవారం ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్ర మాన్ని మండలంలోని మహానందిపల్లె పంచాయతీ సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. వైసిపి పాలనలో ప్రతి ఒక్కరూ లబ్ధిపొందారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని తెలిపారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి అంకనగురివిరెడ్డి,, ఎంపిపి నారాయణ, జెసిఎస్ కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, వైసిపి సింగిల్ విండో అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, ఇఒపిఆర్‌డి వసంతకుమారి, బూత్ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, విఆర్ఒ చెన్నరాయుడు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సగిలి సుదర్శన్

ప్రజారోగ్యం కోసం పాటుపడాలి

కడప అర్బన్ : ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రుచి శుచి ఉండేలా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తే హోటళ్లకు ప్రజాదరణ తప్పక లభిస్తుందని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం కడప హోటల్స్ అండ్ ఫుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక షాహి దర్బార్ సమావేశ మందిరంలో ' హోటల్లో ఆహారం ఆరోగ్య భద్రత ఆతిథ్యరంగం చట్టాలపై' సర్వసభ్య సమావేశం, అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హోటళ్ల యజమానులు ప్రజారోగ్యానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలని వినియోగదారునికి రుచి, శుచి, ఆరోగ్యవంతమైన తాజాగా ఉన్న ఆహారాన్ని అందివ్వగలిగినప్పుడే మంచి ఆదరణ పొందగలరని అభిప్రాయపడ్డారు. హోటళ్లను పరిశుభ్రంగా ఉంచాలని, రంగులు టేస్టింగ్ సాల్ట్ మోతాదుకు మించి వాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ అంశాలపై వస్తున్న మార్పులు సూచనలతో హోటల్ సిబ్బందికి యజమానులకు తరచూ ఫాస్ట్ ట్రాక్ శిక్షణతో పాటు ఉత్తమ హోటళ్లకు హైజెనిక్ రేటింగ్ ఇవ్వన్నట్లు తెలిపారు. ఫుడ్ పర్యవేక్షణ అధికారి ఎండి షంషేర్ ఖాన్ మాట్లాడుతూ నేటి పరిస్థితులలో హోటల్ రంగం ఎక్కువగా విస్తరిస్తోందని, ఫుడ్ సేఫ్టీ చట్టాలను పాటించే హోటల్ యజమానులకు తగిన సూచనలు సలహాలు అందించి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హోటళ్ల సంఘం జోనల్ వైస్ ప్రెసిడెంట్ లయన్ మానస కె. చిన్నపరెడ్డి, హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.ఎం. రషీద్ ఖాన్, సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు.

వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న కొండపల్లి సుబ్బారావు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - బద్వేలు

గ్రంథాలయాలు జ్ఞాన నిధి భాండాగారాలని యోగివేమన యూనివర్సిటీ కౌన్సిలర్ సభ్యులు కొండపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం గ్రంథాలయానికి వచ్చే పాఠకుల కోసం రూ. 10 వేల విలువగల వాటర్ ఫిల్టర్ వితరణచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠకుల కోసం తనవంతు సాయంగా వాటర్ ఫిల్టర్ వితరణ చేశానని చెప్పారు. గ్రంథాలయ అధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ పాఠకుల కోసం గ్రంథాలయంలో వాటర్ ఫిల్టర్ బహూకరించడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అనంతరం దాతను, కౌన్సిలర్ ఉమాదేవిని, రాష్ట్రబీసీ సంక్షేమ సంఘంవర్కింగ్ కమిటీ అధ్యక్షులు రమణ యాదవ్ ను శాలువలతో పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన కమిటీ చైర్మన్ బి .గురుమూర్తి, నియోజకవర్గ బిసి సంక్షేమ అధ్యక్షులు అనిల్ కుమార్ రాజ, ఆవాజ్ అధ్యక్ష ఉపాధ్యక్షులు సత్తార్, ఖాజాగౌస్, కే.బి రసూల్, ఆర్యవైశ్య నాయకులు పువ్వాడి నాగరాజా పాల్గొన్నారు.

హెచ్ఐవి పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

కడప అర్బన్ : హెచ్ఐవి శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎపి ఎస్ ఎసి ఎస్, కౌన్సిలర్ల, టిఐఎన్‌జిఒ ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎవరు హెచ్ఐవికి గురికాకుండా, హెచ్ఐవి సోకినవారు ఎవరు వివక్షకు గురికాకుండా ఆదరించాలని కోరారు. డిసెంబర్ 1 నిర్వహిఒంచే ప్రపంచ ఎయిడ్స్ దినం విజయవంతం చేయాలని పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాలు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, ప్రోగ్రాం మేనేజర్ వి.వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ గర్భిణులకు హిప్, సిఫిలిస్ పరీక్షలు మొదటి త్రైమాసికంలో నిర్వహించాలని తెలిపారు.

నేటి నుంచి 'జీవన్ ఉత్సవ్'

కడప అర్బన్ : ఈనెల 29 నుంచి జీవన్ ఉత్సవ్ పాలసీని ఎల్ఐసి ప్రారంభిస్తున్నదని, ప్రజలు ప్రత్యేకించి ఆధునిక యువతరం దీనిని ఆదరించాలని ఎల్ఐసి కడప సీనియర్ డివిషనల్ మేనేజర్ కె. గిరిధర్ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 90 రోజుల వయసున్న శిశువు నుంచి 65 సంవత్సరాలు వయసున్న వ్యక్తి వరకు ఈ పాలసీ తీసుకోవచ్చని అన్నారు. ప్రీమియం చెల్లింపు కాలం తక్కువ ఉండాలని కోరుకునే వారికి ఇది ఉపయుక్తమైన పాలసీ అని తెలిపారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ నారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

బద్వేల్‌లో భూ కబ్జాలు, ఫోర్జరీ సంతాలు, తప్పుడు ధృవీకరణ పత్రాలతో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు విచ్చల విడిగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్‌కు పంపిన తప్పుడు రిపోర్టుపై విచారించి బద్వేల్ ఆర్‌డిఒ, గోపవరం తహశీలార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి రక్షించాలని అఖిలపక్ష నాయకులు కోరినా పట్టించుకోలేదని చెప్పారు. కలెక్టర్ దృష్టికి ఈ నెల 20న తీసుకువెళ్లామని పేర్కొన్నారు. కలెక్టర్‌కు ఆర్‌డిఒ తప్పుడు రిపోర్టును పంపించారని విమర్శించారు. బద్వేల్ మున్సిపల్ పట్టణంలో భాగమైన మరుకలవారిపల్లె గ్రామం, సర్వే నంబరు 977/3. విస్తీర్ణంలో 2.34 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. చాటకొండు సుబ్బారావు, ములుగురి మల్లిఖార్జున నాయుడు 1.02 ఎకరాల భూమిని ఒక కోటియాభైలక్షలకు అన్‌రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా ప్రభుత్వ భూమిని అక్రమంగా అమ్ముకున్నారని చెప్పారు. మిగిలిన భూమిని సైతం విక్రయించారని తెలిపారు. ఆ భూమి ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.25 కోట్లు చేస్తుందని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో రెవెన్యూ అధికారులకు ముడుపులు ముట్టాయని తెలిపారు. భూమిని రక్షించేందుకు జెసితో విచారణ చేపట్టాలని కోరారు. సమావేశంలో బిఎస్‌పి సగిలి గురప్ప, హేతువాద సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్ రావు, సీనియర్ జర్నలిస్ట్ అంజి పాల్గొన్నారు.

మహిళలకు ఆపన్న హస్తం వన్‌స్టాప్ సెంటర్ : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ అని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. మంగళవారం ఆమె రిమ్స్ ఆవరణలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను (సఖి) సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకే చోట అనేక సేవలు ఉన్నాయన్నారు. సెంటర్‌లో రిజిస్టర్లను జడ్జి పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం ,మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం ,తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయి అని చెప్పారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు ,యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు , వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు సంప్రదించవచ్చు అన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కలిగి ఉండాలి అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల పెంపునకు చర్యలు

- ఎపి ఉద్యాన సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ ఉద్యాన సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో చిరుధాన్యాల విలువ జోడింపుపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాల సాగు వల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఏరువాక కేంద్రం, ఆత్మ కడప వారు సంయుక్తంగా వారం రోజుల పాటు యువ రైతులకు చిరుధానాల విలువల జోడింపు పై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. శిక్షణలో చిరుధాన్య పంటల ఆవశ్యకత, చిరుధాన్యాలు ఉత్పత్తిలో ఉండే పోషకాలు విలువలు, చిరుధాన్యాల సాగుకు అనుకూలమైన నేలలు, వాతావరణ పరిస్థితులు యాజమాన్య పద్ధతులు వివరించడంతోపాటు పలు విజ్ఞాన యాత్రలు క్షేత్రస్థాయిలో చూపించి, వాటికి అవసరమయ్యే యంత్ర పరికరాలు వాటి తయారీకి అయ్యే ఖర్చు వివరాలు తెలియజేశారన్నారు. అనంతరం ఏరువాక కేంద్రం, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ వీరయ్య చిరుధాన్యాలపై యువ రైతులకు వివరించారు, శిక్షణ కార్యక్రమానికి కో- ఆర్డినేటర్ గా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామలక్ష్మి దేవి వ్యవహరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆత్మ డిపిడి పద్మలత, కెవికె శాస్త్రవేత్తలు శిల్పకళా,సాయి మహేశ్వరి, మహేష్ బాబు, మానస ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ముగింపు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

భగ్గు మంటున్న బియ్యం ధరలు

వరి సాగు తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు.. రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి సరఫరా..!

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రాలో బియ్యం ధరలు భగ్గు మంటున్నాయి. ఒక్క ఏడాదిలోనే కిలోకు రూ.9 పైనే ధర పెరిగింది. రేషన్ బియ్యాన్ని సేకరించి, పాలిష్ పట్టి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వరి సాగు తగ్గడం వల్లే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారాలు అంటున్నారు. మేలు రకం బియ్యం 25 కిలోల బస్తా రూ.1,325 నుంచి రూ.1,750కు చేరింది. మధ్యస్తరకం రూ. 1,450కు, సాధారణ రకం రూ.900 నుంచి రూ.11,50కు చేరింది. ఇంత కన్నా తక్కువ ధరకు ఏ బియ్యమూ దుకాణాల్లో లభ్యం కావట్లేదు. దీంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని సేకరించి, పాలిష్ పట్టించి కిలో రూ.25 చొప్పున దుకాణాలకు సరఫరా చేస్తుండడంతో వీటినే కిలో రూ.35 నుంచి రూ.40కు అమ్ముతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఎక్కువగా వాడుతున్న సన్న రకాల బియ్యం ధరలు అంతకంతకు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు హడలిపోతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది బియ్యం సగటు ధర కిలో రూ.43.19 మాత్రమే ఉంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బియ్యం అధిక ధరకు అమ్ముతున్నారు. తడిసిన, రంగు మారిన, ఎక్కువ కాలం నిల్వ ఉన్న రకాలు కూడా రూ.35 కంటే తక్కువకు లభించట్లేదు. సాధారణ బియ్యం మాత్రమే రూ.40కి ఇస్తున్నారు. మధ్య ఉన్న బియ్యం ఇప్పుడు రూ.55 అంటున్నారు. సన్న బియ్యం

దుకాణాలలో లభ్యమవుతున్న పలురకాల బియ్యం

కిలో రూ.64 దాకా పలుకుతున్నాయి. బాస్మతి రకం కిలో రూ.130 పైనే చెబుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో సన్నాలు కిలో సగటున రూ.57.59, మధ్య రకం రూ.50.60, సాధారణ రకం రూ.38.66 ఉన్నాయి. మూడు నెలల్లోనే కిలోకు రూ.5 నుంచి రూ.10 వరకు పెరిగాయి. గతంలో నాలుగైదేళ్లకోసారి పెరిగే బియ్యం ధరలు.. గత ఐదేళ్లుగా ఏటా పెరుగుతూనే ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్‌తో నిమిత్తం లేకుండా గతేడాది కాలంలో నెలనెలా బియ్యం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దేశంలో బియ్యం ధరలు పెరుగుతున్నాయని గత జూలైలో బాస్మతేతర రకాల బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. దీంతో విదేశాల్లో వరి బియ్యానికి విపరీతమైన డిమాండ్ రాగా, ధాన్యం అధికంగా పండించే మన రాష్ట్రంలోనూ బియ్యం ధరలు ఏమాత్రం తగ్గకపోగా, స్థానికంగా పెరుగుతూనే ఉండడం గమనార్హం. ఈ ఏడు వరి సాగు తగ్గడం బియ్యం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖరీఫ్ సీజన్లో 38.80 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సిన వరి 32.62 లక్షల ఎకరాల్లోనే సాగవుతోంది. వర్షాభావం, సాగునీటి ఇబ్బందులు, పెట్టుబడుల భారం, ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో 6లక్షలపైగా ఎకరాల్లో వరి సాగు తగ్గింది. అంతటా వర్షాభావంతో మొదటి పంట ఆలస్యం కావడంతో సాధారణ విస్తీర్ణంలోనూ రెండో పంటగా రైతులందరూ వరి వేసే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు రబీలో దాళ్వా వరి సాగుకు అవసరమైన నీరు వస్తుందన్న నమ్మకం లేదు. అలాగే గత ఏడాది కూడా వరి సాగు బాగా తగ్గింది. ఆ ప్రభావం ఇప్పుడు బియ్యం ధరలపై చూపుతోంది. ముఖ్యంగా సన్న రకాల బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రాష్ట్రంలో పండించిన ధాన్యంలో సగం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ప్రజాపంపిణీ విధానంలో 35-40 శాతం సేకరించి, మిగతా ధాన్యాన్ని సేకరించకుండా చేతులెత్తేస్తుండడంతో రైతులు మిల్లర్లకే అమ్ముకుంటున్నారు. వాస్తవంగా గతంలో ప్రభుత్వం సేకరించగా, రైతులు, ప్రజల అవసరాలకు పోగా బియ్యం మిగిలిపోవడంతో డిమాండ్ లేక ధరలు సామాన్యులకు కాస్త అందుబాటులో ఉండేవి. కానీ, గత ఏడాది పండిన ధాన్యంలో రెండు సీజన్లకు కలిపి 35శాతం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీంతో రైతులు నాణ్యమైన సన్న రకాలను మధ్యవర్తుల ద్వారా మిల్లర్లకు అమ్ముకోవడంతో గత ఆరు నెలలుగా పెరిగిన విద్యుత్ ఛార్జీలతో మిల్లింగ్ ఛార్జీలను దృష్టిలో పెట్టుకుని బియ్యం ధరలు మరింత పెంచారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తన రాజకీయ ఎదుగుదలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఓర్వలేక తప్పుడు కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందం సుబ్బయ్య హత్య కేసులో సెప్టెంబర్ 25న నిందితుడైన బెనర్జీపై జరిగిన హత్యాయత్నం దాడి కేసులో ఏ1, ఏ2లుగా ఉన్న భరత్, రామ్మోహన్‌రెడ్డిలను సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో చాపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. గతంలో బెనర్జీ పలువురిని పలు రకాలుగా దుర్భాషలాడి బెదిరించారని, ఆ క్రమంలోనే సెప్టెంబర్ 25న భరత్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యల మూలంగానే దాడి జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. తాము తమ కార్యకర్తలు ఏనాడు చట్టాన్ని ఉల్లంఘించిన దాఖలాలు లేవని, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆయన ఎస్‌పిని కోరారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా నిందితులను పత్రికా మూలంగా పోలీసులకు లొంగిపోవాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పథకం ప్రకారం తనను కూడా కేసులో ముద్దాయిగా చేర్చారని తెలిపారు. ఈ సందర్భంగా తాను ఎమ్మెల్యే రాచమల్లుకు సవాల్ విసురుతున్నానని.. నందం సుబ్బయ్య హత్య కేసు, బెనర్జీపై జరిగిన హత్యాయత్నం కేసులను సిబిఐచే విచారణ చేయించాలన్నారు. ఇప్పటికే నందం సుబ్బయ్య భార్య అపరాజిత హైకోర్టులో సిబిఐ విచారణ దాఖలు చేశారని పేర్కొన్నారు. అందుకు వైసిపి నాయకులు

మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ఇప్పటికీ కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. ఏ1 ముద్దాయిగా ఉన్న భరత్ కుమార్‌రెడ్డి తల్లి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఆత్మ రక్షణ కోసం తన కుమారుడు దాడి చేశారని పేర్కొంది. ఎమ్మెల్యే రాచమల్లు వల్ల తమకు, తన బిడ్డకు ప్రాణహాని ఉందన్నారు. ఎ2గా ఉన్న రామ్మోహన్‌రెడ్డి సతీమణి రాజేశ్వరి మాట్లాడుతూ తన భర్త ఇంటి వద్ద నుండి బ్యాంక్ పనుల నిమిత్తం బయటకు వెళ్లారని బెనర్జీ, భరత్ పెనుగులాట సమయంలో దాము విడిపించే ప్రయత్నం చేశారని, పోలీసులు నిజనిర్ధారణ చేసి తన భర్తకు తగు న్యాయం చేయాలన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నుండి తన భర్తకు ప్రాణహాని ఉందన్నారు.

అందరికీ ఆదర్శం మహాత్మా జ్యోతిరావు పూలే

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

మహాత్మా జ్యోతిబా పూలే దేశంలో మొదటి సారిగా మహిళల విద్య కోసం పాటుపడిన మహానుభావుడని, మనమందరం ఆయన అడుగు జాడల్లో నడవాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, నగర మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి వెనుకబడిన వర్గాల వారికి ఆశాజ్యోతి అయ్యారన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను దోపిడీ వ్యవస్థ, అంటరానితనం నుండి విముక్తి చేయడానికి నిరంతరం కృషిచేసిన మహోన్నత అన్నారు. ఇలాంటి మహనీయులను స్మరించుకుంటూ ఆయన వేసిన బాటలో మనమందరం పయనించాలని కోరారు. జాతీయ బి.సి. మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, కమిటీ సభ్యులు జె వి రమణ, సిందే భాస్కర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, స్థానిక కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు అఫ్జల్ ఖాన్, నరపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, ఆదినారాయణ, బాదుల్లా, హెచ్ రహీం, నాయకురాళ్ళు టి.వి సుబ్బమ్మ, మరియలు, నారాయణమ్మ, వివిధ కుల సంఘాల నాయకులు జెవి రమణ, వినోద్, సిందే భాస్కర్, నాయకులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** జ్యోతి రావు పూలే133వ వర్ధంతి సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇసి సురేంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ సుప్రియ, నేషనల్ ఈవెంట్ కో-ఆర్డినేటర్ మనోహర్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో..** సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు కొనియాడారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, యూసఫ్,నాయకులు యస్. సజీద, మూర్తి, జగదీష్, పవన్ పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..** ఒబిసి జిల్లా అధ్యక్షులు చిన్న కులాయప్ప ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కల్లూరు వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల జిల్లా ఉపాధ్యక్షులు సిద్దయ్య, సూర్యం పాల్గొన్నారు. **బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..** మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని ఈ సందర్భంగా గోవింద నాగరాజు అన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, గౌరవ సలహాదారులు గురుస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ యాదవ్, జిల్లా యువజన అధ్యక్షులు సిఆర్ఐ సునీల్ జయంత్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, ఆర్ల గంగయ్య, సుంకర రామచంద్రుడు, రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, నగర ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు, నగర ఉపాధ్యక్షులు మల్లికార్జున యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, రంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే అస్పృశ్యతా నిర్మూలనకు, మహిళా సాధికారత కోసం నిరంతరం శ్రమించిన మహాత్ముడు అని బిసి సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండరామ్ అన్నారు. మంగళవారం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **బద్వేలు :** నేటి యువతీ యువకులు మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, మహిళా కో కన్వీనర్ నాగలక్ష్మి ,పట్టణ నాయకులు ఓబుల్ రెడ్డి బి శివకుమార్, ఇమ్మానేలు ,రాజా, వెంకటసుబ్బయ్య, రాజన్న పాల్గొన్నారు. **వేంపల్లె :** మహిళా విద్యా కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఉత్తన్న, చెన్నకేశవ, బద్రి, రాఘవయ్య, సుబ్బరాయుడు, వినయ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని, చదువుతోపాటు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత నేటి పాలకులదేనని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు నవీన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భూపేష్‌రెడ్డి చొరవతో కెసి కెనాల్‌కు నీరు విడుదల

పెద్దముడియం : మండలం పరిధిలోని శుద్దపల్లె, జంగాలపల్లె, జె.కొట్టాలపల్లె, ఉప్పలూరు గ్రామ రైతుల పొలాలకు జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి చొరవతో అధికారులు కెసి కెనాల్‌కు నీరు విడుదల చేశారు. పంటలు ఎండుతున్నాయని రైతులు భూపేష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన ఆళ్లగడ్డ మండలం లింగందిన్నె గేట్ నెంబర్ 27 దగ్గరికి వెళ్లి డిఇతో మాట్లాడి నీరు విడుదల చేయించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా వాసి ముఖ్యమంత్రిగా ఉండి అధికారులతో మాట్లాడి నీరు విడుదల చేయించకపోవడం బాధాకరమన్నారు. నీరు విడుదల అనంతరం రైతులు భూపేష్‌రెడ్డిని, అధికారులను అభినందించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఇంజనీర్ రమణ, లస్కర్ ఓబులేసు, పెద్దముడియం మండలం రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. జంగాలపల్లి, ఉప్పులూరులో భూపేష్‌రెడ్డి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బాండ్లను పంపిణీ చేశారు.

మరో హామీని నిలబెట్టుకున్న సిఎం జగన్ : ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లెపల్లె గ్రామ పంచాయతీలోని చెంచయ్యగారిపల్లె గ్రామంలో వైఎస్ఆర్ జలకల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచితంగా బోర్లు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎపిలో జగన్ సర్కార్ సంక్షేమ పథకాలతో దూసుకెళుతోందన్నారు. తాజాగా రైతుల కోసం మరో కీలకమైన హామీని నెరవేర్చిందన్నారు. నవరత్నాల్లో రైతులకు ఉచిత బోర్‌వెల్‌పై ఇచ్చిన హామీ మేరకు బోరుబావుల తవ్వకం కోసం వైఎస్ఆర్ జలకళ పథకానికి శ్రీకారం చుటిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి వీరనారాయణరెడ్డి, అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, ఎం.పీ.డీ.వో వెంగమునిరెడ్డి, మండల కన్వీనర్ రత్నకుమార్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ సుబ్బారెడ్డి, ఎపిడి జుబేదా, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం : నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఎస్పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అధికారులు లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు మంగళవారం ఉదయం మండలంలోని నర్వకాటిపల్లె గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు శేషాచలం రిజర్వు ఫారెస్ట్‌లో దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. వీరితోపాటు ఒక మోటర్ సైకిల్, మూడు సెల్‌ఫోన్స్, ఒక గొడ్డలి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

మాట్లాడుతున్న డిటిఒ మల్లికార్జున

పర్యాటకులను ఆకర్షించాలి

- జిల్లా పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పర్యాటకులను ఆకర్షించేలా వివిధ యాజమాన్యాలు కృషి చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున సూచించారు. మండల పరిధిలోని గండికోట గ్రామంలోని హరిత టూరిజంలో మంగళవారం స్థానిక సర్పంచ్ కె.గురుఈశ్వర్ అధ్యక్షతన స్వదేశీ సందర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వదేశీ సందర్శన్ కార్యక్రమంలో గండికోట పర్యాటక ప్రదేశం ఎంపికైందన్నారు. ఇక్కడి హోటల్ నిర్వాహకులు, వ్యాపారస్తులు, గైడ్స్ కొన్ని మెలకువలు పాటించాలన్నారు. వచ్చిన ప్రతి పర్యాటకుడు మళ్లీ వచ్చేలా చేయడంలో మీ కృషి వెలకట్టలేనిదన్నారు. చక్కటి సంస్కృతి, మర్యాద, మాటతీరు, ప్రవర్తన, వేషధారణ బాగుండాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ ఇక్కడి ప్రాంతంపై చక్కటి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, సర్పంచ్ గురుఈశ్వర్ రాయల్, హరిత హోటల్ మేనేజర్ మురళి రాయల్, స్వదేశీ సందర్శన్‌పై ప్రసంగించారు. కార్యక్రమంలో అఖిల్, వీరప్రసాద్, హుస్సేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మల్లికార్జున

రైతు రాజ్యం టిడిపితోనే సాధ్యం

- జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో రైతు రాజ్యం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందని టిడిపి జిల్లా తెలుగు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మలూరి మల్లికార్జున అన్నారు. మంగళవారం పొన్నతోట పంచాయితీలో ఆయన భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమ పథకాలు రాష్ట్ర సంక్షేమానికి నిలువుటద్దం పడుతున్నాయన్నారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రైతులకు రూ.20వేలు, పిల్లల చదువులకు ఎంతమంది ఉన్నా రూ.15,000 ఏడాదికొకసారి చొప్పున ఐదేళ్ల ఇస్తారన్నారు. మహిళలకు కుటుంబానికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తూ, ఉచిత బస్సు రవాణా ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 ఇవ్వనున్నట్లు వివరించారు. పేదలను సంపన్నులుగా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. భూపేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ఉండాలన్నారు. ఎమ్మెల్యేగా భూపేష్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్లికార్జున కోరారు.

అధిక ఫీజుల దందా నడుస్తోంది : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓపెన్ స్కూల్ ఏవైతే ప్రభుత్వం అనుమతులు గుర్తింపు పొంది ఉన్నాయో వాటిని కాదని, కొంతమంది అనుమతులు లేకుండా ఓపెన్ స్టడీ స్కూల్ నడుపుతూన్నరని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపా ధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రైవేట్ కళా శాలలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యా ర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపేసిన వారు ఏదైనా ఉద్యో గం కోసం ఉపయోగకరంగా ఓపెన్ స్టడీ స్కూల్స్ ఏర్పాటు చేశారన్నారు. వీటిని ఆసరా తీసుకొని కొంతమంది ప్రయివేటు వ్యక్తులు అర్హతలేని వారందరూ కొన్ని పేర్లతో నడుపుకుంటూ వెళ్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఓపెన్ స్టడీ సెంటర్లలో మాత్రమే అడ్మిషన్ పొందాలని తెలిపారు. జమ్మలమడుగు పట్ట ణంలోని విద్యాధికారులు, జిల్లా ఉన్నత విద్యాధికారులు, ఓపెన్ స్టడీ స్కూల్స్‌కు సంబంధించిన అధికారులు వీటిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో మూఢనమ్మకాలను విడనాడాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ విజ్ఞానం పెంచుకొని, శాస్త్రీయంగా ఆలోచించి మూఢనమ్మకాలను విడనాడాలని జనవిజ్ఞాన వేదిక(జెవివి)పట్టణ అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు అన్నారు. స్థానిక జిన్నారోడ్డులోని మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మూఢనమ్మకాల వల్ల ఎన్నో అనర్థాలు జరిగాయని తెలిపారు. అక్షరాస్యత తక్కువగా ఉన్న రోజుల్లో ఇలాంటివి తరచూ చోటుచేసుకుంటూ ఉండేవని గుర్తు చేశారు. ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా ఆలోచించినప్పుడే ఇలాంటి మూఢనమ్మకాలు తొలగుతాయన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కులున్నాయని, రాజ్యాంగం ద్వారా అవి మనకు సంక్రమించాయన్నారు. అనంతరం జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ చెకుముకి మండలస్థాయి సంబరాల సమావేశం గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ ప్రధానోపాధ్యాయులు మునెమ్మ, సోషియల్ టీచర్ చాంద్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌తో 'గంగవరం' భేటీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, సీనియర్ నేత నది ఊరికి చెందిన సూర్యనారాయణరెడ్డితో మంగళవారం వైసిపి రెబెల్ నాయకుడు గంగవరం శేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. 2019 ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి మద్దతుగా పనిచేసిన సూర్యనారాయణరెడ్డి ఆయన సోదరుడు మాజీ ఎంపిటిసి బాల నారాయణరెడ్డి కొంతకాలంగా ఎమ్మెల్యేకు దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో గంగవరం శేఖర్‌రెడ్డి సూర్యనారాయణరెడ్డిని తన స్వగృహంలో కలిశారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. వైసిపి రెబెల్ నాయకులు ఒకటవుతున్నారనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా రెబల్ నాయకులను ఒక్క తాటిపైకి తెచ్చే ఆలోచనలో గంగవరం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సూర్యనారాయణ రెడ్డిని కలిసే క్రమంలో గంగవరం శేఖర్‌రెడ్డి టిడిపి నాయకులతో కలిసి వెళ్లడంతో ఆయన టిడిపిలో చేరుతున్నారనే సమాచారానికి బలం చేకూరుతోంది. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో వీరి కలయిక పట్టణంలో రాజకీయంగా వేడి వాతావరణాన్ని సృష్టిస్తోందని చెప్పవచ్చు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- పనులను పరిశీలించిన కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు సూచించారు. సింహాద్రిపురంలో జరుగుతున్న సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ, పోలీస్‌స్టేషన్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు, పార్కు, ఆర్టీసీ బస్టాండు తదితర పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిశంబర్ 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీటిని ప్రారంభిస్తారన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేయాలన్నారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు. పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పాడా ఓఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బి ఇఇ మహేశ్వర్‌రెడ్డి, డిఇ జగదీశ్వర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిటీసీ కృష్ణమూర్తి, తహశీల్దార్ మహబూబ్ బాషా, వైసిపి జిల్లా కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైసిపి నాయకులు

రైతు సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో మంగళవారం రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అలాగే పత్తూరులో వైయస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ఆయన తనయుడు మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన ఆదర్శనీయమన్నారు. రైతుల సంక్షేమానికి, ప్రజల ఆరోగ్య రక్షణకు సిఎం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికే ఓటు వేసి, వేయించి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఉప మండల అధ్యక్షుడు చంద్రభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దొరవారి రాముడు, మండల పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు ముల్వర్ హుస్సేన్, ఆంజనేయ కొట్టాల వైసిపి నాయకులు పెద్దిరెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అప్పనపల్లి ఎంపీటీసీ బండి శ్రీనివాసులు, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, సర్పంచులు పట్టు పోగుల లక్ష్మయ్య, గడ్డం రేణుక, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేశ పురోభివృద్ధికి ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ పురోభి వృద్ధికి ఓటు వజ్రాయుధం వంటిదని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ వివే కానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటును ప్రతి యవత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటుతోనే మంచి నాయకుడ్ని ఎన్నుకునే వీలుం టుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యవతి, యువకుడు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు శివలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, చరిత్ర శాఖ విభాగాధిపతి బాలగొండ గంగాధర్, డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసిసి మీడియా చైర్మన్‌గా సుబ్బారావు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వైఎస్ఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది భూతమాపురం వెంకట సుబ్బారావును నియ మించారు. ఆ మేరకు మంగళవారం పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి నియామక పత్రాన్ని అందించినట్లు సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తనను జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్‌గా నియమించినందుకు పిసిసి ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్, ముఖ్యంగా తులసిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను ప్రజలకు చేరవేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు పాటుపడతానని సుబ్బారావు తెలిపారు.

అన్ని వర్గాలకు లబ్ధి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఎంపిపి టి.లక్ష్మమయ్య తెలిపాఉ. మండల పరిధిలోని చిన్నగురువలూరు గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపిపి, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి పది ప్రశ్నల నియమావళిని చదివి సమాధానాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, కుచ్చుపాప సర్పంచ్ సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు యల్లారెడ్డి, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నెలకొన్నాయని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర పేర్కొన్నారు. నంద్యాల రోడ్డులోని సీతారామాంజనేయ నగర్‌లోని 11వ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డి, రవి, భూమిరెడ్డి సుబ్బరాయుడు, వేపరాల సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాయని, వీరంతా జగన్‌కు అండగా ఉన్నారని జడ్పీటీసి తమ్మిశెట్టి బాలయ్య అన్నారు. మండలంలోని పెదనపాడు గ్రామంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రంతుల్లయ్య, పెదనపాడు సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ అమరావతి, కోడూరు సర్పంచ్ వాసుదేవరెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు సాంబశివారెడ్డి, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

సిరిబండి మహోత్సవ ట్రయల్ రన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని అంకాలమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సిరిబండి మహోత్సవానికి సంబంధించి సిరిబండిని కలెక్టర్ విజయ్‌రామరాజు ఆధ్వర్యంలో మంగళవారం ట్రయల్‌రన్ నిర్వహించారు. అంకాలమ్మ దేవస్థానం నుంచి సిరిబండి ఊరేగింపుగా పట్టణంలో తిరగనుంది. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న కాంప్లెక్స్ నిర్మాణ పనుల్లో భాగంగా సిరిబండి వెళ్లే దారిలో అడ్డంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల సిరిబండి అటువైపు నుంచి ఇటువైపు రాదన్న ఉద్దేశంతో ప్రజలు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన సిరిబండి ట్రయల్ నిర్వహించారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో వెంకటేష్, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అంకాలమ్మ దేవస్థానం ఆలయ చైర్మన్ ప్రసాద్, గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కిషోర్, రమణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంప్రదాయ బద్దంగానే ఊరేగింపు నిర్వహించాలి

గతంలో ఎలా ఊరేగింపు నిర్వహిస్తారో అదే విధంగానే ఎద్దులతోనే సిరిబండి ఊరేగింపులు నిర్వహించాలని అమ్మవారి భక్తులు, ప్రజలు కోరుతున్నారు. సంప్రదాయలకు వ్యతిరేకంగా ఉదయం పూజలు చేస్తే అరిష్టమనే విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించి సిరిబండి వెళ్లే దారి మార్గాన్ని సరి చేయాల్సిందిగా కోరుతున్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి : ఎంపిజె

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు

పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఈ సమస్య నుండి ప్రజలను కాపాడాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజె) రాష్ట్ర కార్యదర్శి కోరారు. ఆ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు, దేవాలయాల సమీపంలో జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయని వివరించారు. తక్షణమే చర్యలు తీసుకొని ప్రజలను కుక్కల బెడద నుండి కాపాడాలని ఆయన కోరారు.